ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 21 సెప్టెంబరు 2024
5

రేపు మానుకోటకు కేంద్రమంత్రి జార్జి కురియన్ రాక

మహబూబాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి ఈనెల 22న కేంద్ర మత్స్య, పశుసంపద, మైనార్టీ వెల్ఫేర్ సంక్షేమ శాఖమంత్రి జార్జి కురియన్ వస్తున్నారు. ఈ మేరకు బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కురియన్ మహబూబాబాద్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించనున్నారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నర్సంపేట, డోర్నకల్, ఇల్లందు, మానుకోట అసెంబ్లీ సెగ్మెంట్‌ల ముఖ్యకార్యకర్తల సమావేశం ఉంటుందని, సభ్యత్వ నమోదుపై సమీక్షించ నున్నారని పేర్కొన్నారు. నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్‌ల బీజేపీ ముఖ్యులు హాజరుకావాలన్నారు.



నెత్తుటి చరిత్ర!

మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20 ఏళ్లు

- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- ఉద్యమ యోధులను బలితీసుకున్న కరోనా
- రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతల మృతి
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన ఓరుగల్లు విప్లవయోధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే..
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

విప్లవాల పురిటి గడ్డ ఓరుగల్లు.. ఎన్నో నక్సల్స్ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రాంతం. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టుల వరకు ఎంతోమంది పోరాటానికి మద్దతుగా నిలిచిన నేల. ఆపద వస్తే అడవి నుంచి అన్నలు వస్తారని ఎదురుచూసే అణగారిన ప్రజలున్న పోరుగడ్డ. నక్సల్స్ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఓరుగల్లు గడ్డపైనే తెలంగాణ తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది యోధులు చిందించిన నెత్తురు ఓ చరిత్రను రాసింది. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలమైన అనంతరం 2004 సెప్టెంబరు 21న అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌తో పాటు మరో రెండు విప్లవ సంఘాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నాటి నుంచి నేటి వరకు మావోయిస్టులు పోరుబాటను వదల్లేదు. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు. ఓవైపు ప్రభుత్వం నుంచి అణచివేతలు.. మరోవైపు కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదురొడ్డారు. తుపాకీతూటాతో రాజ్యాధికారం సాధించాలన్న లక్ష్యంతో పోరుబాట సాగిస్తున్న క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌తోపాటు అనేక మంది మావోయిస్టులు కరోనాకు బలయ్యారు. 20ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది మావోయిస్టు నేతలు, మిలిటెంట్లు, ఇన్‌ఫార్మర్లతో పాటు పోలీసులు సైతం రక్తం చిందించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



7

చరిత్ర ఘనం.. భవనం శిథిలం



మహబూబాబాద్‌లో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం





ఆవరణలోకి చేరిన వర్షపు నీరు (ఫైల్)

- అధ్వానంగా జూనియర్ కళాశాల పాత భవనం
- మానుకోటలో భయం భయంగా విద్యార్థుల చదువులు
- వర్షం వస్తే తటాకాన్ని తలపిస్తున్న కాలేజీ ఆవరణ
- ఐదు కొత్త గదుల్లోనే జనరల్, వొకేషనల్ క్లాసుల నిర్వహణ
- నూతన రూమ్‌ల నిర్మాణం కోసం టీపీజేఏసీ విజ్ఞప్తి
- ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులకు వినతులు

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు20 : ఆ కళాశాల ఎందరినో తీర్చిదిద్దిన ఘనచరిత్ర. ఇక్కడ చదివిన లక్షలాది మంది విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగారు. ఎందరో ప్రజాప్రతినిధులుగా, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా నిలిచి, అత్యున్నత స్థానాల్లో నిలిచారు. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన చదువులమ్మ తల్లి (కళాశాల)కు కష్టాలు తప్పడం లేదు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యాబుద్ధులు నేర్చుకున్న చరిత్ర ఆపాదించుకుంది. ఈ కాలేజీ భవనం నేడు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం చదువుతున్న ఇంటర్ విద్యార్థులు భయం..భయంగా ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది.

వర్షం వస్తే కళాశాల ఆవరణ చిన్నపాటి తటాకం (చెరువు)లా కన్పిస్తోంది. దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రమైనప్పటికి కాలేజీ నూతన భవనం మాత్రం మంజూరు కాలేదు. కొన్ని సంవత్సరాల క్రితం ఐదు నూతన తరగతి గదులను నిర్మిస్తే అందులోనే ఇటు జనరల్, అటు వొకేషనల్ తరగతులు, ప్రాక్టికల్ నిర్వహణ సాగుతోంది. విద్యాబుద్ధులు నేర్పే అధ్యాపకులకు కనీసం స్టాఫ్ రూం కూడా కరువైంది. దీంతో లైబ్రరీకి కేటాయించిన గదిలోనే స్టాఫ్‌రూమ్‌తో పాటు ప్రిన్సిపాల్ చాంబర్‌ను ఏర్పాటు చేశారు.

ఇక జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) కార్యాలయానికి సైతం నూతన భవనం లేక పోవడంతో కళాశాల ఆడిటోరియంలోనే ఏర్పాటు చేశారు. ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దిన క్రీడామైదానం ఆటలకు అనుగుణంగా ఎంతో ఘనచరిత్ర కలిగిన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన గదులను మంజూరు చేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్, మానుకోట జిల్లా కలెక్టర్‌కు వినతులను అందించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ కళాశాలకు నూతన తరగతి గదులను మంజూరు చేసి, విద్యాభ్యున్నతికి కృషి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నిజాం కాలంలో 1928లో పాఠశాలగా స్థాపన

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. పూర్వ తాలుకా, ప్రస్తుత జిల్లా కేంద్రం మహబూబాబాద్‌లో నిజాం కాలంలో 1928లో ఉర్దూ మీడియంతో పాఠశాలను స్థాపించారు. అది 1950 వరకు కొనసాగింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక 1951 నుంచి 1970 వరకు మల్టీ పర్పస్ పాఠశాల (ఆరో తరగతి నుంచి 12 వరకు)ను నిర్వహించారు. 1960 వరకు నిజాం కాలంలో నిర్మించిన పాఠశాల భవనంలోనే మల్టీ పర్పస్ పాఠశాలను నిర్వహించారు. గదులు సరిపోకపోవడంతో 1960లో అదే ఆవరణలో కొద్ది దూరంలో మరో భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత 1971 నుంచి ప్రభు త్వ బాలుర జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి ఆ భవనం లో కళాశాల నిర్వహణ కొనసాగుతోంది. నిజాం కాలంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వ బాలుర పాఠశాలకు నూతన భవనం మంజూరు కాగా, పాత భవన స్థానంలో నిర్మించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మాత్రం పాత భవనంలోనే నడుస్తోంది.

ఐదు గదుల్లో కాలేజీ నిర్వహణ..

మానుకోట పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ (తెలుగు, ఇంగ్లీష్ మీడియం)తో పాటు వొకేషనల్‌కు సంబంధించి కోర్సులు మెకానికల్ ఇంజనీర్ (ఎంఈ), ఎలక్ట్రికల్ అండ్ వైరింగ్ (ఈటీ) మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) ఇంగ్లీష్ మీడియం కోర్సులు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం కళాశాలలో 207 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే కొద్ది సంవత్సరాల క్రితం కళాశాలలో ఐదు తరగతి గదులను నిర్మించారు. ప్రస్తుతం పాత గదులు మొత్తం శిథిలావస్థకు చేరుకోవడంతో ఒక్కటి, రెండు పాత గదులతో పాటు కొత్త గదుల్లోనే తరగతుల నిర్వహణ సాగుతోంది. నూతన గదుల్లో ఒక్కదానిలో ప్రిన్సిపాల్ చాంబర్, అందులోనే ఒక పక్కకు స్టాఫ్‌రూమ్, గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు.

ఇక మిగిలిన వాటిలో హెచ్‌ఈసీ, సీఈసీ ద్వితీయ సంవత్సరం తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులను కలిపి ఒక్క గదిలో క్లాసులు బోధిస్తున్నారు. హెచ్‌ఈసీ, సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మరొక గదిలో బోధన జరుగుతుంది. వొకేషనల్ కోర్సులు కూడా అన్ని కలిపి ఒకేగదిలో బోధించాల్సిన దైన్య స్థితి నెలకొంది. ఇక ప్రాక్టికల్ నిర్వహణకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 8 గదులు,

▸▸ మిగతా 8వ పేజీలో..



వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న మైస శ్రీనివాస్

అదనపు తరగతి గదులను మంజూరు చేయాలి

- మైస శ్రీనివాస్, టీపీజేఏసీ స్టేట్ కోకన్వీనర్, మానుకోట



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలి. గదులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాతభవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో విద్యనభ్యసించాలంటే భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే టీపీజేఏసీ తరపున ప్రభుత్వ పెద్దలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించి సమస్యలను వారిదృష్టికి తీసుకుపోయాం. ప్రభుత్వం స్పందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలి.



పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఎస్సెస్సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

▸▸ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 20 : పదో తరగతిలో వందకువందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి పాఠశాలను శుక్రవారం అకస్మీకంగా సందర్శించారు. స్కూల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాద కరమైన వాతావరణంలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. పరిసరాలను పరి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. పాఠశాల హెచ్‌ఎంలు మందుల శ్రీరాములు, లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్

అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లవద్దు

▸▸ డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 20 : మహిళలు అర్హతలేని వైద్యుల వద్దకు వెళ్లి, అబార్షన్‌లు చేయించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 'పిండ లింగానిర్ధారణ చట్టం-1994'పై శుక్రవారం జిల్లాస్థాయి అడ్వయిజరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ, బాలికల పట్ల వివక్షత, ఎంటీపీ చట్టం గూర్చి ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గర్భిణీలు పరీక్షల నిమిత్తం లింగనిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హతలేని వైద్యుల దగ్గరికి వెళ్లవద్దని అన్నారు. ఎంటీపీ చట్టం ప్రకారం.. ప్రత్యేక పరిస్థితులలో అర్హులైన వారి అబార్షన్ కోసం గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో అవకాశం కల్పించబడిందన్నారు. జిల్లాలో గుర్తింపులేని, అర్హత లేని వ్యక్తులు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పుట్టబోయే శిశువు ఆడ,మగ అని తెలుసుకోవడానికి వస్తేవారి వివరాలను పీహెచ్‌సీకి తెలియజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అధికారులు సారంగం, నాగేశ్వర్‌రావు, పిల్లల వైద్య నిపుణులు జగదీశ్వర్, సీడీపీవో శిరీష, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, వెంకటస్వామి, కె.ప్రసాద్, కేవీ రాజు, రామకృష్ణ, అరుణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య మందిరాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు..

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (పల్లె దవాఖానా) ఇక నుంచి హెచ్‌ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించాలని సంబంధిత వైద్యాధికారులను డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్ ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌ఐవీకి సంబంధించిన వివిధ అంశాలతో పాటు పరీక్ష విధివిధానాలను చూపించడం జరుగుతుందన్నారు. ఐసీటీసీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉండగా ఇక నుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో కూడా పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. లైంగిక సంబంధిత వ్యాధులను వివరించి హైరిస్క్ గ్రూపులు గర్భిణీలకు తగిన కౌన్సిలింగ్‌నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సారంగం, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, జ్యోతి, రమేష్, రాజు, రామకృష్ణ, సారయ్య పాల్గొన్నారు.

మాజీమంత్రి కుటుంబానికి చెందిన.. రైస్‌మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

▸▸ మిల్లులో ధాన్యం ఖాళీ.. యాజమానిపై క్రిమినల్ కేసు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 20 : మండలంలోని ఎల్లంపేట గ్రామ శివారులోలో ఉన్న బీఆర్ఎస్ మాజీమంత్రి కుటుంబానికి చెందిన లక్ష్మీపారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌పై రాష్ట్ర సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం సాయంత్రం దాడులు జరిపారు. ఈ దాడులు చేసిన సమయంలో ఆ మిల్లులో ధాన్యం బస్తాలు లేవు. ఖాళీగా మిల్లు కన్పించడంతో అధికారులు అవాక్కయ్యారు. ధాన్యం బస్తాలను మిల్లు యాజమాన్యం అమ్ముకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. జిల్లాలోని వివిధ రైస్‌మిల్లులు కస్టం మిల్లింగ్‌రైస్ (సీఎంఆర్) బియ్యాన్ని కోట్లాది రూపాయల బకాయిలు పడ్డారు. అందులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ మాట్లాడారు. లక్ష్మీపారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌లో 2022-23 రబీలో 62,579 క్వింటాళ్ల ధాన్యాన్ని జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు బియ్యం మర ఆడించి నేరుగా ప్రభుత్వానికి ఇవ్వడానికి సదరు మిల్లుకు ఇచ్చారు. అందుకు గాను 42,553 క్వింటాళ్ల బియ్యం మిల్లు యాజమాన్యం సివిల్ సప్లయీస్‌కు ఇవ్వాల్సి ఉంది. ధాన్యం విలువ రూ.6.49 కోట్లు. మిల్లు యాజమాన్యం ఇప్పటి వరకు ఆ బియ్యం ఇవ్వక పోవడంతో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. తాము దాడులు చేసిన సమయంలో ధాన్యం బస్తాలు మిల్లులోలేవని, బస్తాలను యాజమాన్యం అమ్ముకున్నారని చెప్పారు. ఈ దాడులు నిర్వహించిన సమయంలో మిల్లు యాజమాని అందుబాటులో లేరని తెలిపారు. పంచనామా నిర్వహించి, మిల్లు యాజమానిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, పౌరసరఫరాల మేనేజర్ కృష్ణవేణితో పాటు మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎస్సై సతీష్ పాల్గొన్నా రు. ఇదిలా ఉండగా.. జిల్లాలో పలు రైస్‌మిల్లుల యాజమానులు కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పెట్టడం లేదు.



ఎల్లంపేటలోని లక్ష్మీపారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌లో ధాన్యం బస్తాల నిల్వలపై ఆరా తీస్తున్న అధికారులు


కేసముద్రం మార్కెట్ చైర్మన్‌గా గంట?

▸▸ ప్రిన్సిపల్ సెక్రటరీ పేరిట ఉత్తర్వులు వైరల్

కేసముద్రం, సెప్టెంబర్ 20 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా కల్వల తాజామాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డిని ఎంపిక చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కాబినెట్ సమావేశం అనంతరం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు పేరిట ఉత్తర్వులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఉత్తర్వులుగా మార్కెటింగ్‌శాఖ కమిషనర్‌కు వెళ్లి అక్కడి నుంచి జిల్లా, స్థానిక మార్కెట్ అధికారులకు ఉత్తర్వులు వస్తాయి. దీనిపై మార్కెటింగ్ శాఖాధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉండగా, దాదాపు ఇదే ఖరారవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారులుగా వ్యవహరిస్తున్న ఈ మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డికి ప్రధాన అనుచరునిగా గంట సంజీవరెడ్డి ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు ఈ పదవిని కట్టబెట్టినట్లు తెలుస్తోంది. గతంలో సంజీవరెడ్డి ఇదే మార్కెట్ చైర్మన్‌గా, రెండు పర్యాయాలుగా కల్వల సర్పంచ్‌గా, కేసముద్రం సొసైటీ చైర్మన్‌గా పనిచేయడం గమనార్హం. అలాగే మార్కెట్ కమిటీ సభ్యులుగాస్థానికులైన చింతకుంట్ల యాదగిరి, ఎండీ.అయూబ్‌ఖాన్, వ్యాపారుల విభాగంలో చిదిరాల వసంతరావు, వోలం రమేష్ పేర్లు ఈ ఉత్తర్వుల్లో ఉన్నాయి.



గంట సంజీవరెడ్డి



మహబూబాబాద్‌లో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు శనిగారపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హనుమకొండలోని ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సునిల్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం జీవితాన్ని ధారబోసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ'

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సరేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ నివాళి తెలిపారు. జాతీయ ఉద్యమంలో తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాల్లో, సాయుధ రైతాంగ పోరాటంలో సహకార ఉద్యమంలో లక్ష్మణ్‌బాపూజీ పాత్ర అద్వితీయమైనదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బ్రిటీష్ రెసిడెన్సీపై జెండా ఎగురవేశారన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేయడమేకాక, 96ఏళ్ల వయసులో తెలంగాణ కోసం దీక్ష చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. విప్లవ పంథాను అనుసరించడంలోనూ పార్లమెంటరీ పంథాలో సాగటంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. లక్ష్మణ్‌బాపూజీ ఆధ్వర్యంలోనే దేశంలోనే ప్రప్రథమంగా సహకార సంఘాలు పురుడు పోసుకున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీకి సీఎం రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్ తదితరులు

సుందర్‌రాజ్ యూ టర్న్

- కేటీఆర్ వద్దకు తీసుకెళ్లిన వినయ్‌భాస్కర్
- పార్టీ మారనని మాజీ కుడా చైర్మన్ స్పష్టీకరణ

రాంనగర్, సెప్టెంబరు 20: బీఆర్ఎస్‌ను వీడాలనుకున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యూటర్న్ తీసుకున్నారు. సుందర్‌రాజ్ పార్టీ వీడుతున్నట్లు రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడిన విషయం తెలిసిందే. పశ్చిమలో ఉన్న బలమైన బీసీ నేతను పోగొట్టుకోవడం సరికాదని నిర్ణయించి రెండురోజులుగా సుందర్‌రాజ్‌తో చర్చలు జరిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ శుక్రవారం సుందర్‌రాజ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాడు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో మాదిరిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని కేటీఆర్ సుందర్‌రాజ్‌తో అన్నట్లు తెలిసింది. నేతల మధ్య ఏమైనా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే వరంగల్‌కు వస్తానని కేటీఆర్ తెలిపినట్లు సమాచారం. కాగా, కేటీఆర్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని సుందర్‌రాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సూచించినట్లు సమాచారం.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్ (18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్ చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే తమ కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

నెత్తుటి చరిత్ర!

● మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
● పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
● వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
● ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీపీఐ(మావోయిస్టు) ఉద్యమానికి నేటితో ఇరువై ఏళ్లు నిండాయి. 2004లో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నాటి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల పేరిట మైదాన ప్రాంతాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ రహస్య ప్రాంతాలపై గురి పెట్టిన పోలీసులు నక్సల్స్‌పై వల విసరటంతో తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపుతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో కలిసి విలీనమై అదే ఏడాది సెప్టెంబరు 21న సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. ఇలా శనివారం నాటికి మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు. అయితే నాటి చర్చల అనంతరం మావోయిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో మావోయిస్టు దండకారణ్య ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోకి మకాం మార్చారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని అడవులను కేంద్రంగా చేసుకుని నక్సల్స్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో పూర్వవైభవం కోసం మావోయిస్టులు రెండు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలం కాలేక పోతున్నాయి. ఈ 20ఏళ్ల కాలంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉన్న భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మవోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 2015 సెప్టెంబరు 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డేపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగటం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణ వాదుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక 1991కాలంలో మావోయిస్టులు అనేక మంది కీలక నేతలను కోల్పోయారు.

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ఎస్‌యూ నేత పులి అంజయ్య అలియాస్ సాగర్ రాష్ట్రకార్యదర్శిగా ఎదిగి 1991ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత వరుసగా కేంద్ర కమిటీసభ్యులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎదిగిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, గుండెబోయిన అంజయ్య అలియాస్ బాలన్న, శెట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, తిప్పారపు రాములు అలియాస్ తాతా, బగే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ లాంటి కీలక నేతలు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో పార్టీ పెను సంక్షోభంలోకి వెళ్లింది.

కరోనాతో మావోయిస్టులు విలవిల

మావోయిస్టు పార్టీ గత 20 ఏళ్లలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తును ఎదుర్కొంది. ఎన్నో ఎన్‌కౌంటర్లు, దాడులు, బాంబు బ్లాస్టింగులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచి పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు కరోనా నుంచి తప్పించుకోలేక పోయారు. దీంతో 2020-21 మధ్యకాలంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు కరోనాతో మృతి చెందటం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓరుగల్లుకు చెందిన అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాడగూడెంకు చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరి భూషన్ 2021 జూన్ 21న కరోనాతోనే మృతి చెందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10వ తేదీన కరోనా బారిన పడి గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతోనే కన్నుమూసింది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021 జనవరి 18వ తేదీన అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరితో పాటు సుమారు 10మందికి పైగా మావోయిస్టు నేతలు కరోనా బారిన పడి మృతి చెందినట్లుగా సమాచారం. అలాగే మావోయిస్టు పార్టీ అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు అనేక మంది మావోయిస్టులు కరోనా బారిన పడ్డట్లు ప్రచారం జరిగింది. ఇలా ఎన్నిక సంక్షోభాలు ఎదురైనా ఎప్పటికప్పుడు కొత్త నాయకత్వాన్ని సృష్టిస్తూ ఆ లోటును భర్తీ చేసింది. కానీ ప్రస్తుతం ఆ కాలం నాటి రిక్రూట్‌మెంట్‌లు లేవు. దీంతో కరోనాతో కీలక నేతలను కోల్పోయినా మావోయిస్టులు వారి స్థానాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ మృతి తరువాత రెండున్నరేళ్ల వరకు నూతన కార్యదర్శిని నియమించలేకపోయింది. ఈ పరిణామాలు చూస్తుంటే కరోనా మహ్మారి మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపిందనేది స్పష్టమవుతోంది.

మరో 27మందికిపైగా అజ్ఞాతంలో..

20ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో 1991-94కాలం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న మావోయిస్టులు 30ఏళ్ల తరువాత 2021-24లో అంతకంటే పెను సంక్షోభంలో కూరుకపోయారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రస్తుతం పోరుబాటలో ఓరుగల్లు నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో దామోదర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ మావోయిస్టుల్లో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో గణేష్ మావోయిస్టుల చర్చల ప్రతినిధిగా వెళ్లారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి బాబునావు, అంకీశ్వరం సారయ్యలతో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో 18మందికి పైగా అజ్ఞాతంలో ఉండగా, భూపాలపల్లి జిల్లా నుంచి నలుగురు, ములుగు జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27మందికి పైగా నక్సల్స్ మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్నట్టుగా సమాచారం.

ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతూ..

మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా ఉండటంతో.. ఎక్కడ ఏ అడవుల్లో తుపాకీ పేలినా ఇక్కడి పల్లెల్లో అలజడి మొదలయ్యేది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారున్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబీకులు ఎదురుచూసేవారు. 2010లో అప్పటి ప్రభుత్వం మావోయిస్టు నేతలను గుర్తించింది. అందులో కరీంనగర్ నుంచి 60మంది అజ్ఞాతంలో ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో అదీ కీలక పదవుల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 14ఏళ్ల కాలంలో 60శాతం మంది మావోయిస్టులు లొంగిపోవటమో, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటమో, అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలంలో ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారు.

- ఈ ఏడాది ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయనతో పాటు ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా మృతి చెందింది.
- ఏప్రిల్ 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశినేని రవి అలియాస్ వినయ్ మృతి చెందాడు.
- జూలై 25వ తేదీన ములుగు- భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు.
- ఈనెల 5వ తేదీన ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందాడు.

చెస్‌పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు20: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమకొండ టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లాస్థాయి చెస్ పోటీలను వాల్ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి క్రీడాపోటీల నిర్వాకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో మేధోసంపత్తి చేకూరుతుందని, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు, 4బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వర్షానికి మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలు

ఓపెన్ యార్డులో వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రంలో 600 బస్తాలకుపైగా తడిచిన సరుకు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబర్ 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మార్కెట్లో తడిచిపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 72మంది రైతులు 2,724 బస్తాల్లో 1,634 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు తీసుకువచ్చారు. కొంతమంది రైతుల సరుకుల్లో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. వీరిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా కొద్ది నిమిషాలపాటు వర్షం కురవడంతో ఓపెన్ యార్డులో ఉన్న రైతులు తమ సరుకును కాపాడుకోలేకపోయారు. వర్షంలోనే తడుస్తూ మొక్కజొన్నలను దగ్గరకు కుప్పగా చేర్చారు. మహబూబాబాద్ మండలం వేమునూరు ఇందిరానగర్‌కు చెందిన భూక్య హుస్సేన్ ఎకరంన్నరలో పండించిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. గూడూరు మండలం పొనుగోడు రాములుతండాకు చెందిన భూక్య స్వామి, బానోత్ భద్రు, సాము, ఇనుగుర్తికి చెందిన బానోత్ వెంకన్నతో పాటు మరి కొంతమంది రైతుల సరుకులు పూర్తిగా తడిచి నష్టపోయారు. కొంతమంది టార్పాలిన్లు అందుబాటులో లేక నీటి వరదలో మొక్కజొన్నలు కొట్టుకుపోతున్నప్పటికీ చూస్తూ అలాగే ఉండాల్సిన దైన్యస్థితి నెలకొంది. దాదాపు 20 మంది రైతులకు చెందిన సుమారు 600 బస్తాల మొక్కజొన్నలు తడిచిపోయాయి.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నీళ్లలో తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య హుస్సేన్

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల మార్పులకు మరో అవకాశం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన డిగ్రీ విద్యార్థులు తాము అడ్మిషన్లు పొందిన కళాశాలలోనే కోర్సులను మార్చుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, దోస్త్, కళాశాల విద్యాశాఖాధికారులు మరో అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలో నైనా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు తమకు ఇష్టమైన కోర్సులకు మార్చుకుని చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీదేవసేనా, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిలు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సెప్టెం బరు 21 నుంచి 23 వరకు కళాశాలల కోర్సులు మార్పులు చేసుకోవచ్చునని వివరించారు. 24న తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు స్పష్టంచేశారు. వర్సిటీలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు గమనించి తమ అర్హతల మేరకు తమకు ఇష్టమైన కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

23న కేయూలో సెనెట్‌హాల్‌లో సింపోజియం

హాజరుకానున్న హరగోపాల్, కోదండరామ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న ఉదయం 10గంటలకు డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్-ఇష్యూష్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై సింపోజం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తారు. సింపోజింలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజికవేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

డిగ్రీ ఇయర్ వైజ్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్‌లో డిగ్రీ, పీజీ కోర్సులు చదివిన పాత విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించాలని కేయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఉపేం దర్‌రెడ్డి జనరల్ సెక్రటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఒక్కటి , రెండు సబ్జెక్టులు తప్పిపోయి డిగ్రీ ఉత్తీర్ణత సాధించలేకపోయారని వారికీ మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. అఖరు చాన్స్‌గానైనా డిగ్రీ పాత విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని కోరారు. అలాగే యూడీఎఫ్ ఫీజులను తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం అధికారులతో సమీక్షా సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంవో మురళి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమయ్యలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయడానికి పవర్ గ్రిడ్ ముందుకు రావడంపై కలెక్టర్ వారిని అభినందించారు. ఎంజీఎం ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజనీర్ సీహెచ్.సంపత్ పాల్గొన్నారు.

ఓపీ ల్యాబ్‌లో రోగుల కష్టాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగుల కోసం ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లోకి వెళ్లాలంటే రోగులు నరకయాతన అనుభవించాల్సిందే. రోగ నిర్ధారణకు అవసరమయ్యే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్ షుగర్ పరీక్షల లాంటివి ఈ ల్యాబ్‌లో చేస్తారు. ప్రస్తుత సీజన్‌లో అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో ఆ గదిలోకి పైకి ఎక్కాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు జారీ కింద పడుతున్నారని వాపోతున్నారు. గతంలో మందులు ఇచ్చే దగ్గరనే ఈ 47వ నెంబరు ల్యాబ్ ఉండేది. ఓపీ పక్కనే ఈ ల్యాబ్ ఉండటంతో చాలా సౌకర్యంగా ఉండేది. అధికారులకు ఏమైందో ఏమో కాని లేకుంటే తీసుకొచ్చి దూరాన ఏర్పాటు చేశారు. అది కూడా పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు రోగులకు అనువైన చోటికి ఓపీ సేవలను దగ్గర ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంజీఎంలో ఫిర్యాదుల పెట్టెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టేందుకు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. రోగులు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో రాసి ఈ బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ వీటిని స్వయంగా తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. ఎంజీఎంలో పదికిపైగా ఇలాంటి పెట్టెలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇంకా మెరుగైన ఫలితాల కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపీ కౌంటర్ల సంఖ్యనుకూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక మృతదేహం తరలించడంలో వైఫల్యం

'ఎక్స్'లో సర్కారుపై కేటీఆర్ వ్యాఖ్యలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందిన గిరిజన బాలిక గీతిక (6)ను తరలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన ఎక్స్ ఖాతాలో ఈ విషయంపై స్పందించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఉండి కూడా గిరిజన బాలిక మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి అవమానకరం అని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి ఇంది పరాకాష్టగా మిగులుందన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నోస్టాప్

● ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
● కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

గిర్మాజీపేట, సెప్టెంబరు 20: వరంగల్ - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా విజయవాడ - కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు గరీబ్‌రథ్, వందేభారత్, గోదావరి, పద్మావతి, సింహపురి, తదితర 39 రైళ్లకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తాత్కాలికంగా ఎత్తివేసినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనాలుగు రోజుల పాటు గరీబ్‌రథ్, వందేభారత్, కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్‌కు బదులుగా కాజీపేటలో ఆగుతాయని, ఇతర రైళ్లు కూడా యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు.

కాజీపేటలో ఆగే రైళ్లు ఇవే..

ప్రస్తుతం వరంగల్‌లో మాత్రమే స్టాప్ కలిగి కాజీపేటలో స్టాప్‌లేని విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గరీబ్‌రథ్ రైళ్లు ఈనెల 25 నుంచి 29 వరకు, షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ 25న, కాకినాడటౌన్ - లింగంపల్లి - కాకినాడటౌన్ కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 26, 27 తేదీల్లో, టాటా - యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 26న వరంగల్‌కు బదులుగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా ఆగుతాయని తెలిపారు.



యథావిధిగా కాజీపేటలో హాల్టింగ్

గూడూరు - సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాకినాడ పోర్ట్ - లింగంపల్లి - కాకినాడ పోర్ట్ గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మణుగూరు - సికింద్రాబాద్ - మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్టణం - బీదర్ - మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాంబరం - హైద్రాబాద్ - తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నర్సాపూర్ - నాగర్‌సోల్ - నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాలుగు రోజులు వరంగల్‌లో ఆగకుండా యథావిధిగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని తెలిపారు. అలాగే విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - హైద్రాబాద్ - శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - సాయినగర్‌షిర్డి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని శ్రీధర్ తెలిపారు. సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్ట్ - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - సికింద్రాబాద్ - శాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు. అలాగే యశ్వంతాపూర్ - నిజాముద్దీన్ - యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 22నుంచి అక్టోబరు 7వరకు ప్రస్తుత కాచిగూడ - కాజీపేట - బల్లార్ష - నాగపూర్‌కు బదులుగా కాచిగూడ - నిజామాబాద్ - ముద్కెడ్ - పింపల్ కుటి నాగపూర్ మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

వరంగల్‌లో పనిచేయలేం.. ఖమ్మం పంపించండి..

మంత్రికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల మొర

రాంనగర్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లాలో పనిచేయలేమని, తిరిగి ఖమ్మం జిల్లాకు పంపించాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను వరంగల్‌కు, ఇక్కడి వారిని ఖమ్మం పంపించారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వరంగల్‌కు వచ్చిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఏమవుతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల సాకుతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. ఆస్తుల క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, కొద్దిరోజుల్లోనే వరంగల్‌లో పనిచేయలేమని గుర్తించిన ఉద్యోగులు.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. ఏ మాత్రం అవకాశం ఉన్నా తిరిగి ఖమ్మం పంపించాలని కోరినట్లు తెలిసింది.

ముగిసిన రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేటలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వే ట్రాక్‌ల తనిఖీలు శుక్రవారంతో ముగిశాయి. రెండురోజులుగా ప్రత్యేక ట్రాలీలో కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు నిర్మించిన మూడో రైల్వేట్రాక్‌ను పరిశీలించారు. కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగమార్గం వద్ద సేఫ్టీ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సొరంగమార్గంతోపాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. సెఫ్టీ కమిషనర్ సొరంగమార్గం మూడోలైన్‌ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు రైల్వే ఉద్యోగులు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేసిన అనంతరం ఈట్రాక్‌లపై ట్రయల్ రన్ చేయనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 20 : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాత పోచారం గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్ (22), తల్లి కోటేశ్వరితో కలిసి తమ భూమిలోని మిర్చి తోటలో పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం, వానతో పాటు ఉరుములు, మెరుపులతో వారు పనులు చేస్తున్న ప్రదేశంలో పిడుగుపడడంతో ప్రవీణ్ స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న తల్లి కోటేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పక్కపొలం రైతులు ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.

3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు అక్టోబరు 3వ తేదీ నుంచి 7 వరకు జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయా పరీక్షల నిర్వహణపై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పదో తరగతి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎస్సెస్సీ 247 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌కు 290 మంది పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. మహబూబాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష జరిగే సమయంలో ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించడం, జిరాక్స్ సెంటర్లు మూసివేయడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులకు అనుమతిలేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ, పోస్టల్, విద్యుత్, మునిసిపల్, వైద్య తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులు వి.రాజేశ్వర్, నరేష్, డాక్టర్ మురళీధర్, రాజేంద్రప్రసాద్, టౌన్ సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతి లేని ఎరువులు, విత్తనాలు అమ్మొద్దు : ఏడీఏ

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 20 : ప్రభుత్వ అనుమతి లేని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అమ్మినట్లయితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడడు ఎ.శ్రీనివాస్ హెచ్చరించారు. మహబూబాబాద్ రైతువేదికలో శుక్రవారం డివిజన్‌లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్‌లోని డీలర్లంతా ఎరువులు, పురుగు మందుల లైసెన్స్‌లు కలిగి ఉండాలని, ప్రతీ మందులు అమ్మే సమయంలో జీరోఫారం లైసెన్స్‌లు కలిగి ఉండాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డితో పాటు డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

చరిత్ర ఘనం.. భవనం శిథిలం

(5వ పేజీ తరువాయి)

వొకేషనల్ మూడు గ్రూపులకు ఆరుగదులు, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు అదనపు గదులు అవసరం ఉంటాయి. ఇంకా ప్రిన్సిపాల్ రూమ్, స్టాఫ్‌రూమ్, లైబ్రరీ, డైనింగ్ హాల్ ఇలా బాలుర జూనియర్ కళాశాలకు దాదాపుగా 20 గదులు అవసరపడుతాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయించే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో బోధించాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



గిరిపురం క్రాస్ రోడ్‌లోని కస్తూర్బా బాలికల గురుకులాన్ని తనిఖీ చేస్తున్న అద్వైత్‌కుమార్ సింగ్

చిన్నగూడూరు, సెప్టెంబరు 20 : విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణంలో బోధన చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. విద్యార్థుల హెల్త్‌ప్రొఫైల్ పరీక్షిస్తూ ఉండాలని సంబంధిత ప్రిన్సిపాళ్లను, వార్డెన్‌లను ఆదేశించారు. ఉగ్గంపల్లి, చిన్నగూడూరు గ్రామాల మధ్య ఉన్న ఆకేరు వాగు, ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, చిన్నగూడూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు. తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, ఆర్ఐ వెంకన్న, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అధికారుల ఉరుకులు.. పరుగులు

● మరిపెడ : మునిసిపల్‌లోని పలు ప్రభుత్వ ఆఫీసులు, పీహెచ్‌సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ అద్వైత్‌సింగ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వివిధ ప్రభుత్వశాఖ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. తొలుత కలెక్టర్ మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. రోగుల వార్డుకు వెళ్లి వైద్యసేవలపై ఆరా తీశారు. అక్కడి నుంచి ఎస్టీ ఆశ్రమ స్కూల్‌ను తనిఖీ చేశారు. టాయిటెట్లు, పరిసరాలను పరిశీలించారు. బోధనపై విద్యార్థులతో మాట్లాడారు. వంటలను చెక్ చేశారు. కలెక్టర్ తనిఖీ విషయం తెలిసి స్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు హైఅలర్ట్‌తో ఉన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్టీ ఆశ్రమ స్కూల్ టీచర్లను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. తహసీల్దారు సైదులు, మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, పీహెచ్‌సీ డాక్టర్ రవి, డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఒకరోజు ఉపాధ్యాయులు.. బాగా బోధిస్తున్నారు

● మరిపెడ రూరల్ : ఒకరోజు ఉపాధ్యాయులు.. తోటి విద్యార్థులకు క్షుణ్ణంగా, చాలా మంచిగా బోధిస్తున్నారని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ విద్యార్థినులను మెచ్చుకున్నారు. గిరిపురం క్రాస్‌రోడ్డు వద్ద కసూర్బాగాంధీ గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించడానికి వచ్చారు. దీంతో ఆ గురుకులంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్య బోధన చేస్తున్నారు. అక్కడకు వచ్చిన కలెక్టర్ వారి బోధన చూసి ఆశ్చర్యాన్ని వ్యక్త పరిచారు. ఆ గురుకులంలోనే ఉపాధ్యాయులువిద్యార్థులకు చెబుతున్న పాఠ్యాంశాలు ఇంకా మెరుగు పరచాలని ఆదేశించారు. ఆ తర్వాత విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని, కూరలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీలత, భవాని, స్వాతి, విజేత, ఉమ, కనకలక్ష్మి పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

● వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న రవిచంద్రన్

తొర్రూరు, సెప్టెంబరు 20 : వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, ఆ సేవలను మరింత విస్తృతపర్చాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ పిలుపునిచ్చారు. శుక్రవారం తొర్రూరులో వివిధ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, టైబెల్ట్‌లు, సిమెంట్ బెంచిల వితరణ, ఔతాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.75 వేల విలువ గల ప్యాడ్స్, స్టడీ మెటీరియల్స్ అందించారు. అనంతరం బీసీ తండా వద్ద రూ.లక్షా 20 వేలతో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. తండాలోని 20 మంది పేద మహిళలకు చీరల పంపిణీ చేసి, మాట్లాడారు. కాగా, రవిచందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ గంప సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి వడియాల నూతన్ కుమార్, కోశాధికారి నాగభూషణం, వి.సత్యనారాయణ, వి.కిషోర్‌కుమార్,రీజియన్ చైర్మన్ ప్రొద్దుటూరి గౌరీశంకర్, జోన్ చైర్మన్ నవీన్‌కుమార్, ఐపీసీ గోపారపు రామ ఉపేందర్, సిల్వర్ స్టార్ అన్నపూర్ణ క్లబ్ అధ్యక్షుడు మచ్చ సురేష్, టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ సోమయ్య, వనితా క్లబ్ అధ్యక్షురాలు గాయత్రి, సాయితేజ, నిఖిల్, అఖిల్, రాంబాబు, రమణ, రవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. తొర్రూరులో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ నూతన కార్యవర్గ ఎంపిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టీచర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చింతల సురేష్, ప్రధాన కార్యదర్శిగా వెల్డి సురేష్ కుమార్, కోశాధికారిగా ఎద్దు వెంకన్నతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, జోన్ చైర్మన్ రేగూరి శ్రీదేవి, శారద, రమణారెడ్డి, ఉపేందర్ రెడ్డి, యాకయ్య రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు పేస్ట్ తిని వ్యక్తి ఆత్మహత్య

కేసముద్రం, సెప్టెంబరు 20 : కోరుకొండపల్లికి చెందిన మాం కాల రాము (21) ఎలుకల నివారణ పేస్ట్ తిని శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. అవివాహితుడైన రాము ఖాళీగా తిరుగుతూ మద్యానికి బానిస అయ్యాడు. ఈనెల 15న మద్యం మత్తులో రాము ఎలుకల నివారణకు ఉపయోగించే పేస్ట్ తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు రామును జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఏఎస్సైపై వ్యక్తి దాడి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 20 : రూరల్ రెండో ఏఎస్సైపై దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్‌తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రం శివారు జమాండ్లపల్లికి చెందిన పిట్టల నవీన్ పాత కేసులో విచారించేందుకు మానుకోట రూరల్‌పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా వివరాలు సేకరిస్తున్న రెండో ఏఎస్సై వెంకట్రాములు విచారిస్తుండగా పోలీస్‌స్టేషన్‌లో ఎందుకు వీడియో తీస్తున్నావని నవీన్ ప్రశ్నించగా, ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఏఎస్సైపై నవీన్ దాడి చేయడంతో కుడిచేతి వేలుకు తీవ్ర గాయమైనట్టు సీఐ తెలిపారు. వెంకట్రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పీఆర్టీయూ మండల ఎన్నిక



మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నిమ్మ వెంకటేశ్వర్లు

కురవి, సెప్టెంబరు 20 : పీఆర్టీయూ కురవి మండల కమిటీ ఎన్నికను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడిగా నిమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తూడి వెంకటేష్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆకుతోట శివప్రసాద్, పి.ఉమేశ్వర్, మహిళా అధ్యక్షురాలుగా బి.లక్ష్మీదుర్గ, ఉపాధ్యక్షులుగా జి.నరసింహాచారి,కె.సారంగం, మహిళ కార్యదర్శిగా ఎస్.రంగనాయకి, కార్యదర్శులుగా పి.వినేష్, బి.నరేందర్‌లను ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్లుగా గోపాల శ్రీధర్, బీరం జనార్ధన్‌రెడ్డిలు వ్యవహరించారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ దోలి సత్యనారాయణ

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి

● నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ దోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 : ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చదివిస్తున్న తల్లిదండ్రుల కళలను నిజం చేసేందుకు విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ దోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నలంద జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశంపొందిన నాటి నుంచి క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దోలి సాధన, ప్రిన్సిపాల్స్ గట్ల శ్రీపాల్‌రెడ్డి, వై.కృష్ణప్రసాద్, అధ్యాపకులు ప్రసాద్, ఉప్పలయ్య, రవిశంకర్, నరేష్, రాజు, బిక్షం, బిక్షపతి, ముత్తయ్య, యుగంధర్, రమేష్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



శ్రీధర్, జనార్ధన్‌రెడ్డి

కేసముద్రం, సెప్టెంబరు 20 : ప్రోగ్రెస్సీవ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీటీఆర్‌యూ) కేసముద్రం మండలశాఖ కమిటీని కేసముద్రం విలేజి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షునిగా గోపాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా బీరం జనార్ధన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షునిగా బండారు హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఓరుగంటి పద్మశ్రీ, కార్యదర్శులుగా కర్పూరపు సురేష్, కన్నోజు అరుణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కళ్లెం వెంకట్‌రెడ్డి, రాచకొండ ఉపేందర్‌లు వ్యవహరించగా మండల నోడల్ అధికారి కొత్త జగన్మోహన్‌రెడ్డి, కాలేరు యాదగిరి, రాపోలు యాకయ్య, బండారు నరేందర్, కుర్న హరినాథ్, పత్తి వీరస్వామి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు

గూడూరు, సెప్టెంబరు 20 : బొద్దుగొండ రైతువేదికలో శుక్రవారం గర్భిణీలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాల కార్యక్రమం చేపట్టారు. జగన్నాయకులగూడెం, బొద్దుగొండ, కొల్లాపురం, ఎర్రకుంటతండాల్లో పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను చేపట్టారు. సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ శ్యామలదేవి, చైతన్య, అంగన్‌వాడీ టీచర్లు పెనక భారతి, భవాని, అనూష, పూలమ్మ, రాధ, మంగమ్మ, సరోజ, సుశీల, భారతి, రమణమ్మ, ఏఎన్ఎం శ్రీలత, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● జిల్లా ఇన్‌చార్జ్ సీఈవో నర్మద

నర్సింహులపేట, సెప్టెంబరు 20 : పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ సీఈవో నర్మద అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించారు. జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ, అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీవో మాధవి పనితీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమౌతుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో మాధవి, ఎంపీవో యాకయ్య, గిర్దావరి అఖిల్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ యాలాద్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రవక్త సూచించిన మార్గాన్ని అనుసరించాలి



అన్నదానం చేస్తున్న ఆహ్లే సున్నతుల్ జమాత్ కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 : మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గాన్ని అనుసరించాలని వార్డు కౌన్సిలర్ మహ్మద్ ఫరీద్ అన్నారు. మహబూబాబాద్‌లో ఆహ్లేసున్నతుల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మహా అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ ప్రదా ముస్లిం నిరుపేదలకు తనవంతుగా సాయం చేయాలన్నారు. మహ్మద్‌ఖలీల్, మహ్మద్‌అసద్, మహ్మద్ గౌస్, సయ్యద్ అహ్మద్ రిజ్వీ, సయ్యద్ జాకీర్, యూత్ సభ్యులు గయాజ్, అస్లం,మోహసిన్, ఫజిల్, ఫయిజల్, మఖ్‌సుద్, సమీర్, నయిద్, దిలావర్, అన్సారీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి'

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 20 : సీపీఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పత్తేపురం, చీకటాయపాలెం, మాటేడు, హరిపిరాల, చెర్లపాలెం పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండం జనార్ధన్, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, సంపత్, సబియబాను, జ్యోతి, యాకన్న, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి : ఎంఈవో

పెద్దవంగర, సెప్టెంబరు 20 : విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపర్చేవిధంగా ఉపాధ్యాయులుచర్యలు తీసుకోవాలని ఎంఈవో గుగులోతు రాము అన్నారు. శుక్రవారం పెద్దవంగర మండలంలో అవుతాపురం, పోచంపల్లి, గంట్లగుంట ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యా ప్రమాణాలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సంతోష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగానికి విశిష్ట సేవలందించిన ఎడ్విన్‌రావు'

డోర్నకల్, సెప్టెంబరు 20 : సీఎస్ఐ డోర్నకల్ అధ్యక్ష పీఠం ట్రెజరర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎడ్విన్‌రావు విద్యారంగానికి విశిష్ట సేవలందించారని రాయలసీమ డయాసిస్ రైట్.రెవ. బిషప్ ప్రసాదరావు అన్నారు. డోర్నకల్‌లోని చర్చికాంపౌండ్‌లో శుక్రవారం సీఎస్ఐ మాజీ ట్రెజరర్ ఎడ్విన్‌రావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభకు హాజరైన డయాసిస్ రైట్.రెవ. బిషప్ ప్రసాదరావు మాట్లాడుతూ ఎడ్విన్‌రావు 70వ దశకంలో పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి సీఎస్ఐ సంస్థ ద్వారా పాఠశాలలు, వసతి గృహాలను ఏర్పాటు చేసి ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లాల్‌సింగ్ లాజరస్, మనోహర్, కనికరదాస్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్ ఒక్కటే..

● పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఘనపురపు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 20 : ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహజ్యోతి పథకం కింద రాష్ట్రప్రభుత్వం ఇంటి నెంబరులేని వారికి అఫిడవిట్‌తో రూ.938లకే విద్యుత్ మీటరును అందజేస్తుందని, ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆరెందుల వెంకటేశ్వర్లు, బానోత్ ప్రసాద్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, జోనగిరి గిరిధర్ గుప్తా, లక్ష్మి పాల్గొన్నారు.

'వైద్య సిబ్బందిని నియమించాలి'

గార్ల, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో సరిపడా వైద్యసిబ్బందిని నియమించాలని కోరుతూ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం హైదరాబాద్‌లోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టియానోజెడ్‌ఛోంగ్తుకు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ మండలమైన గార్లలో 30 పడకల ఆస్పత్రి నియమించినాగాని సరైన వైద్య సిబ్బంది, డాక్టర్లు లేక రోగులు అనేకఇక్కట్లు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆస్పత్రిలో సరైన సిబ్బంది నియమించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలి

● మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 20 : మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న స్వచ్ఛతాహి సేవాలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 35 వార్డు పరిధిలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. రోడ్డు వెంట ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా మునిసిపాలిటీ వాహనాల్లో వేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ గద్దె నీరజరవి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, మెప్మా ఆర్పీలు ప్రవంతి, నీల, అంగన్‌వాడి టీచర్ సరస్వతి పాల్గొన్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల

కురవి, సెప్టెంబరు 20 : రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటలను ఏఈవోలు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల అన్నారు. నల్లెల్లలో రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ రైతుల రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణకు అర్హులైన వారు వెంటనే ఫ్యామిలీ గ్రూపింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారిని ఆదేశించారు. రైతులు వరినాట్లు వేసి ఒకనెల దాటిన రైతులంతా రెండోదఫా యూరియాను, పోటాష్ (ఎకరాకు 25 కేజీలు) చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జి.నరసింహారావు, ఏఈవో రాజేశ్వరి, వీఆర్‌పీ గౌస్‌పాషా పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

● ఎస్ఎస్ శోభన్‌ప్రసాద్

డోర్నకల్, సెప్టెంబరు 20 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని డోర్నకల్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శోభన్‌ప్రసాద్ అన్నారు. డోర్నకల్ రైల్వే స్టేషన్‌పరిసరాలలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమాన్ని రైల్వే ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. స్టేషన్ ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉందన్నారు. రోజు వేలాదిమంది ప్రయాణించే చోటును పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఏజెన్సీలో భూబదలాయింపు చెల్లదు

● తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్

కొత్తగూడ, సెప్టెంబరు 20 : ఏజెన్సీ గ్రామంలో పెసా గ్రామసభ తీర్మాణం లేకుండా రెవెన్యూ భూమిని అటవీశాఖకు భూబదలాయింపు చేయడం చెల్లదని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్ పేర్కొన్నారు. కొత్తగూడలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ హక్కులు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని 70ఎకరాల రెవెన్యూ భూమిని అటవీశాఖకు భూ బదలాయింపు చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో రెవెన్యూ భూమి ఉంటే భూమిలేని ఆదివాసీలకు భూమి పంచిపెట్టాలి.. కానీ, చట్టాలకు వ్యతిరేకంగా మైదానప్రాంతంలో భూమిని కోల్పోయినఅటవీశాఖకు అప్పగించకూడదన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, నాయకులు ఈక వెంకన్న, ఈక యాకబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులను చేపట్టాలని నిరసన

నెల్లికుదురు, సెప్టెంబరు 20 : రత్తిరాంతండా శివారు కునాయికుంట రోడ్డు పనులను చేపట్టాలని రత్తిరాంతండా మాజీ ఎంపీటీసీ గుగులోత్ మదన్‌లాల్ తెలిపారు. కునాయికుంట రోడ్డుపై తండావాసులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.80 లక్షలు ఐటీడీఏ నిధులుతో రోడ్డు పనులు చేపట్టడానికి శిలాఫలకం వేశారని, పనులు చేట్టలేదన్నారు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలన్నారు. అనిల్, వీరన్న, ఈక్య దేవోజీ, తేర్య ఆశ్వీని, కవిత, సత్య, సాలమ్మ, అంబలి పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ఖండిస్తున్నాం

● బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, యాప సీతయ్య

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 20 : ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారి భారతదేశాన్ని కించపరుస్తూ సంస్కృతికి వ్యతిరేకంగా మాట్లాడడం అనవాయితీగా మారిందన్నారు. అమెరికాలో హిల్లర్‌హోమ్ భారతదేశానికి శత్రువుఅయిన ఆమెతో సమావేశం ఏర్పాటు చేయడం వెనుక అంతర్యం ఏమిటీ ప్రశ్నించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, అధికార ప్రతినిధి దార ఇందుభారతి, శ్రావణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యలమంచిలి వెంకటేశ్వర్‌రావు